# ఆ ఊరి రాజకీయం

''ఈ ప్రాంతంలో ఒక హైస్కూలు ఉందని విన్నాను. అదెక్కడో చెప్తారా ?'' అడిగాడొక యువకుడు స్టేషన్ నుంచి బైటికి రాగానే అతడికి మొట్ట మొదట కనబడిన ఆసామిని.

''తెలియదండి. కాస్త ముందుకెళ్ళి అడగండి.'' అన్నాడు.

ఒక ఇరవై ఏళ్ళ కుర్రవాడు కనబడగానే చదువు సంగతీ స్కూలు సంగతీ ఇతడికి తెలిసే ఉంటుందనుకుని అడిగాడు ఆశతో.

"ఇక్కడ చిన్న స్కూలున్నమాట నిజమే. ఈ వీధి దాటితే ఎదురుగా తాటాకుల పాక కనబడుతుంది. కాని హైస్కూలు ఉందని నాకు తెలియదండి" అన్నాడు. మళ్ళీ "అయినా ఊళ్ళోకెళ్ళి ఎవరినయినా పెద్దవాళ్ళను అడిగి చూడండి.''

ఆ క్రిందటి రోజునుంచీ భోజనంలేని శ్రీహరి స్టేషన్‌లోనే ముఖం కడిగి కాంటీన్‌లో దొరికినదేదో తిని, ఊళ్ళోకి బయలుదేరాడు. కొంచెం చదువు కున్నట్టుగా కనబడిన ఒకరిద్దరిని హైస్కూలును గురించి అడిగాడు.

''అదాండి ! బిల్డింగ్ కట్టారండి. కాని దానికి కప్పుపడలేదండి. ఈ ఊళ్లో హైస్కూలు కమిటీ రెండు పార్టీలుగా చీలింది. కమిటి సభ్యులు ఘర్షణ పడ్డారు. కప్పు దగ్గరికి వచ్చేసరికి పెద్ద తగాదా అయిపోయిందండి. అందుకే ఆగిపోయిందండి" అన్నారిద్దరు ముగ్గురు.

"అయితే కమిటీలో గ్రూపులేర్పడ్డాయా ?''

"అవునండి".

"అయితే నన్ను ఒక గ్రూపు దగ్గరికి తీసుకువెళ్తారా-మీకు శ్రమనిపించక పోతే !''

అట్టే లాభం ఉండదు. మాకు శ్రమేముంది ? ఈ ఊరి వాళ్ళం. రండి వెళ్దాం''

శ్రీహరికేదో మొండిధైర్యం. వాళ్ళతో బయలుదేరి నాలుగు వీధులు దాటిన తరువాత ''ఈ యింటాయనకూడా ఆ కమిటీలో ఆయనేనండి. లోపలికి వెళ్ళండి'' అన్నారు.

ఆ యింటికి గేటులేదు. వీధి తలుపుకు ఇటూ అటూ అరుగులు ఉన్నాయి. తలుపుకొట్టి అక్కడ నిలబడ్డాడు.

కొంతసేపటికి ఆ యింటి యజమాని బైటికి వచ్చి" ఏం కావాలి ? ఎవరు మీరు ?" అని అడిగాడు.

"నేను ఎం.ఏ. చదువుకున్నవాడిని, ఏవిషయమైనా సరే పిల్లలకు పాఠం చెప్పగలను. ఈ ఊళ్ళో ఒక హైస్కూలుందని విని వచ్చాను'' అన్నాడు చేతులు జోడిస్తూ.

"ఈ ఊరికంత అదృష్టం లేదుబాబూ. భవనం మొండిగోడలవరకే నిలిచిపోయింది. అంతకంటె ముందుకు పోలేకపోయాం. ఈ ఊరు పల్లెకాదు - పట్నమూ కాదు. ఎటూ కానిది. ఈ ఊళ్ళో మంచి పనులు జరగటం కష్టం''.

''నాకు వివరాలు నామమాత్రంగా చెప్పండి. నేనూ ప్రయత్నిస్తాను. ఇంతపెద్ద ఊరుంది. మీ పిల్లలను హైస్కూలు చదువులకు పైఊళ్ళకు పంపిస్తారా ? మంచి హైస్కూలు స్థాపించుకుంటే ఈ ఊరికే లాభం కదండి''.

''అవును బాబూ. హైస్కూలు చదువులకే పై ఊళ్ళకు పంపిస్తే కాలేజీ చదువులు కూడా అక్కడే చదివించాలి. అది ఎట్లాగూ తప్పదు. ఇంతచిన్న పిల్లలను పై ఊళ్ళకు పంపితే ఎంతఖర్చు ? చిన్నప్పుడే దురభ్యాసాలకు అలవాటు పడతారు. ఇదంతా తెలియకనా బాబూ ? అంతా తెలిసే జరిగిందిట్లా''

''ఏం జరిగిందో చెబుతారా ? మీకు తీరిక ఉంటే చెప్పండి''

''ఏముంది-వడ్లగింజలోది బియ్యపు గింజ. ఈ ఊరికల్లా పెద్ద వకీలూ డబ్బుగల పెద్దమనిషీ అరఎకరం స్థలం స్కూలుకు దానంగా ఇచ్చాడు. మరొక పెద్ద ఆసామి ఏభయివేలిచ్చాడు స్కూలు బిల్డింగ్ కట్టటానికి. దర్వాజాలు కిటి

కీలు పెట్టింతరువాత వాళ్ళిద్దరిలో అభిప్రాయభేదాలు కలిగాయి. వకీలు తన తల్లి పేరు స్కూలుకు పెట్టాలంటాడు. ఆసామీ తన తల్లిపేరు పెట్టాలంటాడు. ఆయన పెద్ద వకీలు-ఈయన పెద్ద భూస్వామి. వీళ్ళకు చెప్పగలిగిన వాళ్ళు ఎవరూ ఈ ఊళ్ళో లేరు. ప్లానువేసిన ఇంజనీరు అప్పుడప్పుడు వచ్చి చూస్తున్నాడు. కాంట్రాక్టరు పనులు చేయిస్తున్నాడు. డబ్బు చాలలేదంటే మేమంతా ఊళ్లో విరాళాలు వసూలు చేసి పాతికవేలు తెచ్చియిచ్చాము. కప్పువరకూ వచ్చి నిలిచిపోయింది. పెద్దలిద్దరికీ అభిప్రాయభేదం రాగానే స్కూలు మీద ఆసక్తి ఇద్దరికీ తగ్గింది. కమిటీ రెండుగా చీలిపోయింది. ఇదీ జరిగిన సంగతి".

"ఆ వకీలు గారెక్కడుంటారు ?''

''ఆయనతో మాట్లాడి లాభం లేదండి. పెటుకు మనిషి. కుక్కను అదరించినట్టు అదరిస్తాడు. మాటా-మన్నన లేదు''.

''పోనీ వారిల్లు చూపిస్తారా ?''

''ఇల్లు చూపిస్తాం'' వాళ్ళు వకీలు గారింటివరకూ వచ్చి చూపించారు.

శ్రీహరి జంకుతూ లోపలికి వెళ్ళాడు. గేటు దగ్గరే నిలవబెట్టి "ఏంపని ?'' అడిగాడు వాచ్‌మన్.

"అయ్యగారితో మాట్లాడాలి''

''ఆ బల్లమీదకూకోండి. లోనకెళ్ళి చెప్పివస్తా'' రెండు నిమిషాలలో తిరిగి వచ్చి చెప్పాడు.

ఒకగంట తరువాత ఒక అజానుబాహువు-విశాలమైన ఫాలభాగం-నెరిసిన బట్టతల_మెలికలు తిప్పిన మీసాలు-సిల్కు షర్టూ తెల్లటి ధోవతీ మెడలో బంగారు గొలుసు ధరించి హుందాగా హాల్లో పెద్దకుర్చీలో కూర్చుని "లోపలికి రమ్మనరా'' కేకపెట్టాడు.

తెచ్చుకున్న ధైర్యంతో లోపలికి వెళ్ళి ఆయనకు నమస్కారం చేసి నిలబడ్డాడు శ్రీహరి.

''ఏ ఊరయ్యా నీది ? ఏంపని మీద వచ్చావు''

ఉద్యోగ ప్రయత్నంలో వచ్చినట్టు చెప్పి "కష్టపడిచదువుకున్నాను. పిల్లలకు పాఠాలు చెప్పగలను'' అన్నాడు వినయంతో.

''ఇక్కడ పిల్లలు చదువుకోరయ్యా. నీకెందుకీ బాధ ?''

"వెయ్యిగడప ఉన్నదని విన్నాను. చిన్నబడి ఒకటున్నదట. ఆ పిల్లలు పై చదువులకు ఎక్కడికీ వెళ్ళకుండా పుస్తకాలు తెప్పించి నేను చదువు చెబుతానండి''.

"నీవు చెబుతావయ్యా. కాని ఈ ఊరివాళ్ళు ఏపనికీ కలిసిరారు. వాళ్ళు కలిసి వస్తే ఆ బిల్డింగ్‌కి కప్పుపడకపోయిందా ? ఈపాటికి పాఠశాల నడవకపోయిందా ?"

''అట్లా ఎందుకయిందండీ ? అంతవరకూ వచ్చింది ఆగిపోవటమేమిటి?"

''ఆ సంగతి ఒదిలిపెట్టు. నీకు మరేం ఉద్యోగం దొరకలేదా ?" ఆయనకు కను బొమలు ముడిపడ్డాయి.

"లేదండి. పేద కుటుంబం. తల్లీ చెల్లెలు నా మీద ఆధారపడినవాళ్ళు''.

"రేపు కనబడు. ఆలోచించాలి కదా. సరిగ్గా ఈ వేళకురా" వకీలుకు కళ్ళల్లో దివిటీ వెలిగినట్లయింది. మెరుపులాంటి ఊహమనసులో మెదిలింది.

ఆయనకు నమస్కారం చేసి ఆవరణదాటాడు

మరునాడు వచ్చిన శ్రీహరిని మర్యాదగా పలకరించి కుర్చీలో కూర్చోమన్నాడు వకీలు.

''నిన్న వచ్చావుకదా ఈ ఊరు. నీకెవరూ చెప్పలేదా స్కూలు బిల్డింగ్‌ను గురించి ?''

శ్రీహరి మాట్లాడలేదు.

''నేను చెప్తానంతా విను. నాకు ఊరిబయట ఇండ్లస్థలముంటే మా అమ్మ పేరున పాఠశాల బిల్డింగుకని ఇచ్చాను. ఇంకొకాయన ఏభయి వేలిచ్చాడు. ఊరి వాళ్ళంత చందాలు పోగుచేసి కొంత పైకం తెచ్చారు. కప్పు వరకూ వచ్చింది.

ఈ లోపల కమిటీ సభ్యులు మీటింగులు పెట్టి డబ్బు కావాలని కంట్రాక్టరు చెప్పినకొద్దీ కొంతఇచ్చి కొంత ఆపి పెట్టారు ?

"మీ కమిటీ మళ్ళీ సమావేశం కాలేదా ?''

"ఎందుకవుతుంది? మా అమ్మ పేరు పాఠశాలకు పెట్టమన్నాను. అవతలా యన తన తల్లిపేరు పెట్టాలన్నాడు. పంతాలూ పట్టింపులూ వచ్చాయి. నేను కమిటీ పిలిచినా పోలేదు. ఆయనా పోలేదు. పని అంతటితో ఆగింది''

"ఆ కమిటీ రెండు గ్రూపులయిందంటున్నారు కదా ? నేను ఆ రెండు గ్రూపులతో కలిసి, రాజీకుదిరే మార్గమేదయినా ఉందేమో ప్రయత్నించ మంటారా ?'' కాస్త జంకుతూనే అన్నాడు శ్రీహరి.

"రాజీ మాటేకాదు. మా అమ్మ పేరు పెట్టకపోతే నాకింక దానితో సంబంధ ముండదు. ఆయన మాటకూడా ఇదే''

''ఒక్క సంగతి మనవి చేయమంటారా ?''

"ఏమిటది ?"

''మీరు విరాళమిచ్చిన భూమి ఈ రోజుల్లో ఈ ఊళ్ళోనే లక్షపైన విలువ చేస్తుంది. ఆయన ఇచ్చింది ఏభయివేలు. అంత ఖరీదయిన భూమి మీద ఆయిన ఇచ్చిన కొద్ది సొమ్ముతో బిల్డింగు పైదాకాలేపారు. మీది పైచెయ్యిగా ఉంది. కనుక ఆయన మీ మాటవినాలి."

"మరి-అందరూ ఈ మాట చెప్ప రేమయ్యా ?''

"వాళ్ళుకాదు అనాల్సింది. మీరు''

"అట్లాగా ! అయితే కమిటీని పిలవమని చెప్పు. నీకు అందరూ తెలుసా ?''

''తెలుసుకుంటా మీ అమ్మగారి పేరు ఏమిటీ ?''

"రాజమ్మ''

''మంచిది నేనందర్నీ తెలుసుకుని కమిటీని పిలవమని చెప్తా. మీరు కమిటీకి రాకండి. ఏం జరిగిందీ నేను వచ్చిచెబుతా''.

''సరే నీ ప్రయత్నం నీవు చెయ్యి''

శ్రీహరి హోటల్లో భోజనం చేసి రెండూ గ్రూపులనూ సమావేశపరిచాడు. మొట్టమొదట అతడు అడిగిన ప్రశ్న-

"అయ్యా. మీ అమ్మగారి పేరేమిటన్నారు ?''

"అనేదేముందయ్యా. మా తల్లిగారి పేరు ఈశ్వరమ్మ''

శ్రీహరి మందహాసం అందర్నీ ఆశ్చర్యపరిచింది.

ఈ ఊరి పెద్దలిద్దరూ ఘటికులు. ఎక్కడినుంచో వచ్చినాయన వీళ్లిద్దర్నీ కలపగలడా ? వెర్రిమొహం కాకపోతే ? అనుకున్నారు.

''అయ్యా. నా మనవి ఒకటి వినండి. స్కూలు బిల్డింగుకు స్థలమిచ్చింది వకీలుగారు. స్థలం చాలా ఖరీదయింది. ఏభయివేలు విరాళమిచ్చింది ఈ ఊరి పెద్ద ఆసామీ. ఈ సొమ్ము, స్థలం సొమ్ముకంటె తక్కువ. కాని ఇద్దరూ తమ తమ తల్లుల పేరు పెట్టమంటున్నారు కనుక ఇద్దరి పేర్లూ కలిపి పెట్టవచ్చు. ఎక్కువ విరాళమిచ్చిన వారి తల్లి పేరు ముందు పెట్టి, తక్కువ విరాళమిచ్చిన వారి తల్లిపేరు తరువాత పెట్టినట్లయితే రాజమ్మ ఈశ్వరమ్మ కలిపితే రాజేశ్వరి అవుతుంది. అదీగాక ఈ రెండు పేర్లు మరొక విధంగా కలుపుదామన్నా కలవ్వు. అవి రెండూ కలిపినప్పుడు మీ ఊరిని చల్లగా కాపాడగల తల్లి అవుతుంది. మీకు నా మాటనచ్చితే మీరందరూ ఇందుకు ఆమోదించినట్టుగా చప్పట్లు కొట్టండి. వకీలు గారింటికి పోయి చెప్పిరండి'' అన్నాడు శ్రీహరి.

రెండవ ఆసామీ కూడా, ఈ రెండు పేర్ల కలియికతో ఏర్పడిన ఆ కొత్త పేరు విని ఎంతో సంతోషించాడు. తన తల్లికెంతో గౌరవమిచ్చినట్టు భావించి తనూ వకీలు గారింటికి బయలుదేరాడు.

''ఆఁ. పేరులో ఏముందయ్యా ? మన ఊరు బాగుపడాలి ముఖ్యంగా'' అన్నాడు వకీలు అంతావిని. ఆయనకు తన తల్లి పేరు ముందు పెట్టినందుకు మనసులో కొండంత సంతోషంగా ఉంది.

''పైకం సర్దుబాటు చేయాలి. నేను ప్రయత్నించి కప్పపడేటట్టుచూస్తా ఈ నెలలో'' అన్నాడు ఆసామి.

రెండు రోజులయిన తరువాత శ్రీహరి వకీలు గారింటికి వచ్చాడు.

"ఏమయ్యా. మళ్ళీ కనబడలేదు ?''

''మీకిద్దరికీ రాజీ కుదిరిందని నాకు తెలియాలి కదండి''

"తగాదా ఉంటేకద రాజీపడటం'' గడుసుగా అన్నాడు.

"అయితే శుభవార్తే నన్నమాట. మరి నాకేం సెలివిస్తారు ?''

"సెలవిచ్చేదేమిటయ్యా. పాఠశాలకు అన్ని ఏర్పాట్లు చెయ్యి. నడిపించు"

''ముందుగా ఎనిమిదవ తరగతితో ప్రారంభించాలి. ఆ చిన్నబడిలో ఏడవ తరగతి పూర్తిచేసిన వాళ్ళు ఈ స్కూల్లో 8వ క్లాసులో చదువుతారు. వచ్చే ఏడు తొమ్మిదవ తరగతి, ఆపైన పదవ తరగతి పెట్టాలి. ఇదీ పద్ధతి. నేను ఆఫీసుకుపోయి పద్ధతులన్నీ తెలుసుకుని ఒక అధికారిని వెంటబెట్టుకొస్తాను. ఏమంటారు ? మీ కిష్టమేనా ?''

''పద్ధతుల ప్రకారం చెప్పావు. మంచిదే. ముందు జరగవలసిన పని చూడు"

''అయ్యా. నేను పేదవాడిని. నగరంపోయి ఆఫీసుల చుట్టూ తిరిగి వాళ్ళను ఒప్పించి, ఒకరిని ఇక్కడికి తీసుకురావాలి. నా దగ్గరంత డబ్బులేదు. ఏం చెయ్యను ?''

''ఏమిటయ్యా నీ మాటలు ? ఇంతపని చెప్పిన వాళ్ళు డబ్బు యివ్వ కుండా పొమ్మంటారా ? మా గుమస్తాకు కనబడు. నీకు డబ్బిస్తాడు''.

గుమాస్తా చేతిలో పెట్టిన ఐదువందలూ తీసుకుని శ్రీహరి నవ్వుకుంటూ బయలుదేరాడు.

ఈ ఊరివాళ్ళను అమాయకులనుకోవాలా ? లేక ఒకరినొకరు అర్థంచేసు కోలేని పట్టుదల గల మనుష్యులనుకోవాలా ? ఇంతకాలం నుంచీ తెగని సమస్య క్షణంలో పరిష్కరింపబడ్డదంటే ఇందులో ఏదయినా రాజకీయం ఉందా ? లేక పోతే ఒక్క మాటతో అందరూ రాజీకి వస్తారా ? ఏమో ? అయినా ఎప్పుడు తిరిగి తగాదా తలెత్తితే అక్కడ తను వదలిపెట్టేస్తాడు. అది ముందే నిర్ణ యించుకుని నగరం వెళ్ళాడు.

ఆఫీసులో కొందరు అతడికి తెలిసినవాళ్ళే ఉన్నారు. వాళ్ళను సంప్రదించి ఆఫీసర్‌ను చూశాడు. శ్రీహరితో ఒక అసిస్టెంటును పంపే ఏర్పాటు జరిగింది.

శ్రీహరి అసిస్టెంటును తీసుకుని వచ్చేసరికి వకీలూ ఆసామి కలిసి కప్పు వేయటానికి అన్ని ఏర్పాట్లూ చేశారు. పని ప్రారంభమయింది. అసిస్టెంటు బిల్డింగు చూసి మెచ్చుకున్నాడు. స్కూలుకు తగిన ఫర్నిచరు చేయించమనీ ఎనిమిదవ క్లాసుకు అవసరమైన సంఖ్యలో టీచర్లకొరకు పత్రికలో ప్రకటన చేయమనీ చెప్పి, ఒక కాగితం మీద పట్టీరాసిచ్చాడు. ఒకటి రెండు సంవత్స రాలు పిల్లలు ఇచ్చే ఫీజు మీద విరాళాల మీద స్కూలు నడిపితే ప్రభుత్వ సహాయం దొరుకుతుందని కమిటీ సభ్యులకు హామీ ఇచ్చాడు.

అది ఫిబ్రవరి నెల. ఏప్రిల్ నెలలో స్కూళ్ళల్లో పరీక్షలు జరుగుతాయి. సాధారణ పరిస్థితులలో జూను నెలలో స్కూళ్ళు తెరుస్తారు. అప్పుడు విద్యా శాఖాధికారి చేత రాజేశ్వరీ పాఠశాల ప్రారంభోత్సవం జరపటానికి కమిటీ నిశ్చయించింది.

స్కూలు బిల్డింగ్ పనులు, ఫర్నిచరు తయారీ చురుకుగా జరుగుతున్నాయి. వకీలు-శ్రీహరి తెలివితేటలనూ శక్తిసామర్థ్యాలనూ పొగడని నిమిషం లేదు. ఒకరోజు శ్రీహరి కనబడకపోతే తల్లడించి పోతున్నాడు.

ఆ రోజు శ్రీహరి ఉదయం పదిగంటలకు వకీలు గారింటికి వచ్చాడు. అతడిని సాదరంగా లోపలికి తీసుకువెళ్ళి తన పక్కకుర్చీలో కూర్చోబెట్టుకున్నాడు.

“ఏం సంగతులు పంతులూ ?” మామూలుగా ప్రశ్నించి లోపలినుంచి టీ తెప్పించాడు.

‘‘మీతో ఒక విషయం చెప్పాలని వచ్చానండి. నాకు ఈ ఊరి బ్యాంకిలో ఉద్యోగం వచ్చిందండి. ఈ విషయం ముందర మీకు చెప్పాలని వచ్చాను”

వెంటనే వకీలు ముఖం అదోక మాదిరిగా అయిపోయింది. విలువైనదేదో చేతిలో నుంచి జారిపోతున్నట్లనిపించింది.

‘‘మీపనికేం అడ్డం ఉండదండి. నేను స్కూలు పనిచూస్తునే ఉంటానండి.

నాకు ఈ మధ్య అనుభవం గల హెడ్‌మాస్టరు ఒకరు కలిశారు. ఆయన పని చేస్తున్న ఊరు నచ్చక రాజీనామా చేశారట. ఆయన అన్నివిధాలా హెడ్‌మాస్టరుగా పనిచేయటానికి తగిన వ్యక్తి. నెమ్మదిగలవాడు."

''నీకింతలోకి ఎట్లాదొరికిందయ్యా ఉద్యోగం ?''

"ఉద్యోగ ప్రయత్నంలో నేను బ్యాంకి పరీక్షకూడా రాశానండి. సంవత్సరమైంది. ఇంకా ఎన్నో ఉద్యోగాలకు కూడా అప్లికేషన్లు పెట్టానండి.''

వకీలు కొంతసేపు ఏం మాట్లాడలేదు.

వకీలు మనసులో ఏవేవో పథకాలు సుడులు తిరుగుతున్నట్టు శ్రీహరి కనిపెట్టాడు.

''చూడు శ్రీహరీ, నీవేఘడియలో ఈ ఊర్లో పాదంపెట్టావో గాని-పాఠశాలను నిలబెట్టావు. మా రెండు గ్రూపులను కలిపావు. అందరిలో సంఘీభావం నెలకొల్పావు. పనులన్నీ ఎంత గడ్డువయినా చిటికెలో చేశావు. నిన్ను వదిలిపెట్టాలనిలేదయ్యా.''

"నేనెక్కడికి వెళ్తానండీ, ఈ ఊర్లోనే మీ కళ్ళ ఎదుటనేఉంటా. పని మాత్రం బ్యాంకిలో. నేను రోజూ మీకు కనబడుతునే ఉంటా''

"నీకు ఉద్యోగం వచ్చిందికద. మీ తల్లిని చెల్లెల్ని పిలిపించుకోరాదూ ?''

''ఉత్తరం రాశానండి. కొన్ని సర్దుబాట్లు చేసుకుని వస్తారండి''

''ఇదిగో. ముందేచెబుతున్నా. మీ బ్యాంకి దగ్గర్లోనే మాదొక చిన్న ఇల్లుంది. దాంట్లో ఉండు. వేరే ఇల్లుచూడకు''

"అద్దె ఎంతండి ? నేనొకసారి చూడవచ్చా ?''

''చూడు. చిన్నయిల్లు. మట్టసరిగా ఉంది. ఇంటివెనక చిన్న పెరడుంది. చుట్టూ ప్రహరీగోడ, గేటు ఉన్నాయి. మాజీతగాడిని వెంట పంపిస్తా. చూసుకో"

''అద్దె సంగతి చెప్పలేదు. నాకు అందుబాటులో ఉండాలి కదా?''

"ఎంత మాటన్నావయ్యా ! మనలో మనకు అద్దె ఏమిటి ? నీవు ఇవ్వడమూ నేను పుచ్చుకోవటమూనా ?''

"అదేమిటండీ. వ్యవహారం వ్యవహారమే కదండీ"

"నీ దగ్గర వ్యవహారమేమిటయ్యా. ముందువెళ్ళి ఇల్లు చూసుకో. మంచి రోజుచూసి ప్రవేశించు'' లేచాడు కుర్చీలో నుంచి.

ఆలోచనలో పడ్డ శ్రీహరి జీతగాడు రాగానే వెళ్ళి ఇల్లు చూశాడు. రెండు గదులు, వరెండా, వంట ఇల్లు పొందికగా బాగున్నట్టు తోచింది.

శ్రీహరి ఆ ఊరు వచ్చినప్పటినుంచీ కాంతయ్య అతడిని హెచ్చరించాలని సమయంకోసం చూస్తున్నాడు. అతడికి అందరిని గురించీ తెలుసు. కాని పైకి మాట్లాడడు. శ్రీహరిని చూడగానే జాలి కలిగింది.

"కాంతయ్యగారూ. నమస్కారం. నాకు బ్యాంకిలో ఉద్యోగం వచ్చింది. మావాళ్ళను రమ్మనిరాశాను. కొద్దిరోజుల్లో వస్తారు''.

"ఇల్లు చూశారా ?''

''వకీలుగారు ఒక చిన్న ఇల్లు బ్యాంకికి దగ్గర్లో ఉన్నదని ఇచ్చారు. ఎంతయినా వకీలుగారిది పెద్దమనసు. కుటుంబం కూడా పెద్దదేనా ?''

"ఒకటి కాదు రెండండి. ఆ వీధిలో ఒకమేడ, ఈ వీధిలో ఒక మేడ. అక్కడో భార్యా ఇద్దరు పిల్లలు- ఇక్కడొక భార్య, ఒక పిల్ల''

''ఇద్దర్నీ సమానంగా చూస్తాడా ?''

''పెద్దామెది ఆయన కులమే. చిన్న ఆమె లంబాడీది. అయితే వేషం భాష ఆచారం అంతా మార్చేశాడు. చెబితేగాని ఎవరికీ తెలియదు.

చిన్న భార్య మంచి అందకత్తె. పుట్టిన పిల్లకూడా చాలా చక్కనిదండి. ఇద్దరాడపిల్లలూ చదువుతున్నారు. కొడుకు నగరంలో ఎనిమిదోక్లాసు చదవటానికని పదేళ్ళకిందట వెళ్ళాడు. ఇప్పుడేం చదువుతున్నాడో తెలియదు. ఎప్పుడైన వస్తాడు. డబ్బు చాలా ఖర్చుచేస్తాడు. ఇంకా పెళ్ళిచేసుకోలేదు''

''మంచి కుటుంబంలాగే ఉంది''

"మీరు వచ్చేముందే ఒక పని జరిగిందండి. పెద్ద భార్య కూతురు కోమలి ఊరికే సినిమాలు చూస్తుందండి. ఒకరోజు సినెమాకువెళ్ళిన పిల్ల మళ్ళీయింటికి

రాలేదండి. ఏడాది కావచ్చింది. ఆమెను వెతకటానికి ఎన్నో ప్రయత్నాలు చేశారండి. కాని- లాభం లేకపోయింది."

"పాపం. అంత మంచి ఆయనకు ఇది పెద్ద కష్టమే."

''కష్టమేనండి. ఆ కొడుకు ఇల్లంతా గుల్లచేస్తున్నాడు. వకీలు ఇద్దరు భార్యలకు ఆస్తి సమానంగా పంచి ఇచ్చాడండి''

''ఉత్తముడు. ఎవరికీ అన్యాయం చేయలేదన్నమాట"

"ఆయన మనసులో ఒక ఆలోచన ఉందండి. దానికోసం కాపువేసి ఉంచాడండి''

''ఏమిటది ?''

''కొద్దిరోజుల్లో మీకే తెలుస్తుందండి. ఆయనకే ఆలోచనా లేకపోతే ఇంత మంచిపని చేయడండి. అసలు మిమ్మల్ని చూడగానే మంచి బుద్ధులు పుట్టుకొచ్చి నట్టున్నాయి"

"ఏం జరుగుతుందో చూడాలి" అనుకున్నాడు శ్రీహరి.

"ఉన్నట్టుండి వకీలు పెద్దకూతురు ఇంటికి వచ్చింది. తండ్రి చూసీచూడ నట్టూరుకున్నాడు. తల్లి దండించి అడిగింది."

''నేనక్కడ ఊరికే కూర్చోలేదు. సంగీతం నాట్యం నేర్చుకుంటున్నాను. ఒక గురుకులంలాగ పెట్టి గురువుగారు నేర్పిస్తున్నారు. చాలా మంది విద్యార్థులున్నారు అక్కడ."

''నాతల్లే. అట్లా అని ఒక ఉత్తరం రాయకపోయావా ? డబ్బు పంపించే వాళ్ళంగా ?"

''అమ్మా ఆయన డబ్బుతీసుకోరు. ఉచితంగా భోజనం పెట్టి విద్య నేర్పుతున్నారు. పాతికమందికి పైగా నేర్చుకుంటున్నారు."

''చాలా సంతోషం నేను నాన్నగారికి సంగతి చెబుతాను. నీవు నేర్చుకోవటం అయిపోయిందా ఇంకా నేర్చుకోవాలా ?''

''దాదాపు అయిపోయినట్టే. అమ్మా ! ఆయన ఉచితంగా విద్యనేర్పారు మరి నేను గురుదక్షిణ సమర్పించాలి గదా ?''

"నేను నాన్నగారితో మాట్లాడతాలే. అయితే నీవు మళ్ళీ ఎప్పుడు వెళ్ళాలి?"

"ఒకటి రెండు రోజుల్లో"

ఒక ఏడాది సంగీతం నాట్యం ఉచిత భోజన వసతి మొదలైన సౌకర్యాలు కల్పించి నేర్పించినందుకు గురుదక్షిణగా గురువుగారికి బట్టలు, ఐదువేల రూపాయలు తలిదండ్రులు ఆమె చేతికిచ్చారు. మూడవరోజు ప్రయాణమనగా ఆ తెల్లవారుఝామున ఇనప్పెట్టెలో ఉన్న తాకట్టు నగలూ, నగదు పదివేల రూపాయలతో అమ్మాయి పరారయింది. తెల్లవారిన తరువాత తల్లి మొట్టమొదట తెలుసుకున్నది. ఆమె భయపడుతూ భర్త చెవిన వేసింది.

మరొక వారమయినా తిరక్కుండానే కొడుకు రాసిన ఉత్తరం తీసుకుని ఇద్దరు మార్వాడీలు నగరంనుంచి వచ్చారు. ఉత్తరంతో ప్రామిసరీ నోట్లు జోడించి ఉన్నాయి.

వకీలు వాటిని పట్టుకుని కోర్టుకు పోవటానికి కూడా వ్యవధి లేని పరిస్థితి ఏర్పడ్డది.

భార్యను తీసుకుని రెండవ భార్య యింటిమేడమీద ప్రవేశించాడు-రెండవ కంటివాడికయినా తెలియకుండా.

"ఒకనాడు మీరిల్లు మారినట్టు నాకు తెలియదు. ఆ మేడకు వెళ్ళివస్తున్నా" అన్నాడు శ్రీహరి. అతడు ప్రతి సాయంత్రమూ ఒకసారి వస్తూఉంటాడు.

''ఏమోనయ్యా. అందరం ఒకచోటే ఉందామనిపించింది. అమ్మాయికి నగరంలోనే పెళ్ళిచేసి వచ్చాను. అబ్బాయి చదువైపోయిందని బిజినెస్ పెట్టుకున్నాడుట. మా యిద్దరికీ లంకంత ఇల్లెందుకు?'' అన్నాడు జుట్టు సవరించుకుంటూ.

''మీ అరోగ్యం బాగుందికదా?''

"ఇప్పుడు కాస్తనయమే, మీకెట్లాతెలిసింది?''

మొన్న సాయంకాలం నేను వచ్చినప్పుడు వాచ్‌మన్ చెప్పాడు-"దొరకు చాలా సుస్తీగా ఉంది. మేడమీద డాక్టర్లు ఉన్నార''ని.

''ఆ రోజు అదే గుండెనొప్పి వచ్చింది.''

"స్కూలు వ్యవహారం జూన్ నెలలో ఆరంభమవుతుంది. పేపర్లో టీచర్ల కోసం ప్రకటన చేశాను. హెడ్‌మాస్టర్ సిద్ధంగానే ఉన్నాడు."

''అంతా అయిన తరువాత నన్ను కలవండి. ఇంకా నెలపైముంది'' లేచి నిలబడ్డాడు వకీలు.

ఎప్పుడు వెళ్తానన్నా 'ఇంకా కొంచెంసేపు కూర్చో' మనే వకీలు అట్లా అన్నందుకు దిగ్గునలేచాడు శ్రీహరి.

అతడు బైటికి వచ్చి అట్లా పొలాలవైపు వెళ్ళి పొద్దుగూకే వరకు ఇంటికి వెళ్దామనుకున్నాడు. తీరా గేటు దాటి రెండడుగులు లేశాడోలేదో కాంతయ్య ఎదురై "మీరూ పొలాల వైపేనా వెళ్ళేది? నేనూ అటే. రండి, పోదాం" అన్నాడు.

దారిలో పెద్దవేపచెట్టుంది. దానికింద జేబురుమాళ్ళు పరచుకొని కూర్చున్నారిద్దరూ.

కాంతయ్యకు ఏదో చెప్పాలని ఉంది. సందర్భం కలిసి రావటంలేదు. మింగలేక పైకి చెప్పలేక అవస్థపడుతున్నాడు.

శ్రీహరి కొంతసేపటికి బ్యాంకి కబుర్లు చెప్పి తన చెల్లెలికి సంబంధం కుదిరేటట్టుగా ఉందని చెప్పాడు.

''మా చెల్లెలు ఇంటరు ప్యాసయింది. ఆ తరువాత పూనా వెళ్ళి టైలరింగులో డిప్లొమా పాసయింది. బుష్షర్ట్సు ప్యాంట్సు ఆడవాళ్ళబట్టలు పిల్లల బట్టలు అన్నీ కుడుతుంది.''

''కట్నాలు మాట్లాడుకున్నారా?''

''ఒకటి రెండు కానుకలు తప్ప మరేంలేవు. పెళ్ళి తిరుపతిలో చేయాలని మా అమ్మగారి అభీష్టం. ఇక్కడికి వచ్చిన తరువాత అందరికీ తేనీటి విందు.''

"చాలా సంతోషం. తాంబూలాలు పుచ్చుకున్నారా?''

"అతడికి ఎవరూ లేరు. మాయింటికి వచ్చి భోజనం చేశాడు. బహుశః మూడో తారీకున జీతాలందుకుని బయలుదేరుదామనుకుంటున్నాం.''

''చాలా బాగుంది. నలుగురికీ కనువిప్పుగా ఉంది.''

"అంతకంటె ఘనంగా చేయలేను. ఆరాటపడిచేయాలనీ లేదు. నాకు ఉద్యోగం వచ్చేవరకూ మా అమ్మ సంగీత పాఠాలతో ఇల్లు గడిచింది. ఈ పెళ్ళి మా

చెల్లెలు తన సంపాదనతోనే చేసుకుంటానని పట్టుబట్టింది. ఇద్దరికీ ఈడూ జోడూ కుదిరింది. అంతకంటె ఏంకావాలి ?''

''అవునులెండి. మనస్కూలు సంగతి ఏమయిందండి ? మీరు తప్పుకున్నారు. స్కూలు నడిస్తే ఊరు బాగుపడుతుందని మేమందరం ఆశపడ్డాం.''

"నేను తప్పుకోలేదు. నేను దానిసంగతి పూర్తిగా అయ్యేవరకూ చూస్తాను. తరువాత కూడా కొంతపని చేస్తానని మాట ఇచ్చాను అందరి ఎదుట.''

"ఒకమాట. దీన్ని మనసులో పెట్టుకోండి. వకీలుగారు విరాళమిచ్చిన స్థలం ఆయన ఒదినెగారిది. అంటే భార్య అక్కది. ఆమె కాశీకి వెళ్ళుతూ తన నగలూ ఆస్తికి సంబంధించిన కాగితాలూ చెల్లెలిదగ్గర పెట్టి వెళ్ళింది. ఐదేళ్ళయింది. ఇంకా రాలేదు. రాదేమోకూడా, ఆమెకూ వారసులెవరో ఉన్నారట. వాళ్ళకు ఆమె ఆస్తి వివరాలు అంతుచిక్కక ఈయన దగ్గరికి వస్తామని ఉత్తరాలు రాస్తున్నారట. వాళ్ళు పట్టుబట్టి ఆయనను నిలవదీస్తే ఏం జరుగుతుందో ?''
''ఆయన వకీలే కద ? ఆయనే చూసుకుంటాడు.''

''ఆయన వకీలంటే ఏమిటనుకున్నారు ? మనిషికీ మనిషికీ మధ్య ముళ్ళు పెట్టి తగాదాలు పెంచుతాడు. తాను పెద్దమనిషిగా వాటిని తీర్చినట్లు కనబడతాడు. ఇట్లా కట్టినవే మేడ మీద మేడ. కొడుకు చాలా వదిలించాడు. తాకట్టు నగలూ పైకం కూతురు వదిలించింది. వారసులకు వదిన ఆస్తి ఒప్పచెప్పవలసి వస్తుంది. అప్పుడాయన గతి ఏమవుతుందో ఊహించండి.''

"ఇక్కడ ఎవరిని నమ్మాలో ఎవరిని నమ్మగూడదో నాకు బోధపడటం లేదు. నాకు బ్యాంకిలో ఉద్యోగం వచ్చినందుకు ధన్యుణ్ణయ్యాను.''

''అప్పుడే అలా అనుకోకండి. మీరు ఈ ఊరికి కొత్త. ఇక్కడి వ్యవహారాలు తెలియవు. వకీలు మిమ్మల్ని వదలిపెట్టడు. మీ చేత బ్యాంకి ఉద్యోగం మాన్పించి తన లంబాడీ కూతుర్నిచ్చి పెళ్ళి చేయాలని ప్లాన్‌వేశాడు. స్కూలు హెడ్‌మాస్టరు గిరీ మీకు కట్టబెడతాడు. ఎందుకంటే స్కూలు కొంతకాలం విరాళాల మీద పిల్లలఫీజు మీదనడవాలి. ఇంక ఈ ఊళ్ళో విరాళాలు పుట్టవు. ఫీజులు టీచర్ల జీతాలకు చాలవు. హెడ్‌మాస్టరుకు పొగడ్తలు తప్ప జీతం ఉండదు. అదీ ఆయన ఎత్తు'' మెల్లగా చెప్పాడు.

శ్రీహరికి గుండె ఆగినంత పనయింది. తను చేతనైన సహాయం చేయగలడు గాని ఇటువంటి రాజకీయాలలో నెగ్గలేడు. క్షణానికొక మాట మాట్లాడలేడు. వెంటనే బ్యాంకి మేనేజరుగారింటికి వెళ్ళి తిరుపతి వెళ్ళటానికి సెలవు శాంక్షను చేయవలసినదిగా ఒక అప్లికేషను, వీలైనంత తొందరలో తనను మరెక్కడికయినా బదిలీ చెయ్యమని ఒక అప్లికేషనూ ఇచ్చి దయ ఉంచమని కోరాడు.

మరునాడు కాంతయ్యకి సంగతి తెలిసి "వెళ్ళిపోండి బాబూ. వీలైనంత తొందరగా వెళ్ళిపోండి. ఈ ఊరికి ఎవరయినా కొత్తవాళ్ళు వస్తే తమ చేతిలో చిక్కించుకోవాలని ప్రతివ్యక్తి చూస్తాడు. బలవంతుడు గెలుస్తాడు. వెళ్ళండి బాబూ. ఎక్కడయినా బతకండిగాని ఇక్కడుండొద్దు" అని చేతులు జోడించాడు.